క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా బంద్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జాతీయ రహదారుల పనులు జరుగుతున్న కారణంగా జిల్లా కేంద్రంలో విద్యుత్‌కోతలు ఉంటాయని పట్టణ టూటౌన్ ఏఈ ఆదిత్య శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 6.30 గంటల నుంచి 7.30 గంటల దాక విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వినియోగాదారులు సహకరించాలని కోరారు.

సర్వసభ్య సమావేశం..

దేవరకద్ర: మండల సర్వసభ్య సమావేశంలో శనివారం ఉదయం 11 గంటలకు జరగనుందని ఎంపీడీఓ శ్రీనివాసులు ఒక ప్రకటనలో శుక్రవారం పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగే కార్యక్రమానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

పద్యనాటకోత్సవాలు..

స్టేషన్ మహబూబ్‌నగర్: శ్రీపాలమూరు ఆర్ట్ థియేటర్ ఆధ్వర్యంలో శనివారం, ఆదివారం పద్యనాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి టి.కృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 20న మధ్యాహ్నం 1.30 గంటల నుంచి భక్త చింతామణి తదితర నాటకాలు, 21న శ్రీకృష్ణతులాభారం, శ్రీరామాంజనేయ యుద్ధం ప్రదర్శనలు ఉంటాయన్నారు. అధికసంఖ్యలో తరలి వచ్చి ప్రదర్శనలు తిలకించాలన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రానికి వస్తున్న ఓ ఇసుక టిప్పర్‌ను శుక్రవారం ఉదయం పోలీసులు పట్టుకున్నారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలం రాంచంద్రాపురం నుంచి అక్రమంగా ఇసుకను ఈ టిప్పర్‌లో తరలిస్తున్నట్లు తమకు సమాచారం రావడంతో చర్యలు తీసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపారు. ఎలాంటి అనుమతి లేకపోవడంతో టిప్పర్‌ను సీజ్ చేశామన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

స్టేషన్ మహబూబ్‌నగర్: రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జర్నలిస్ట్ తిరుపతయ్యకు టీటీడీ మాజీ డైరెక్టర్ మన్నె జీవన్‌రెడ్డి చేయూత అందించారు. వైద్య ఖర్చుల కోసం రూ.లక్ష సాయం చేశారు.

ఇద్దరు యువతుల అదృశ్యం

భూత్పూర్: వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు యువతులు అదృశ్యమైన ఘటనలు భూత్పూర్ పరిధిలో చోటుచేసుకున్నాయి. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన యువతి గురువారం రాత్రి తల్లిదండ్రులతో పాటు ఇంట్లో నిద్రపోయింది. మధ్య రాత్రి 2 గంటల తల్లిదండ్రులకు మెలుకువ వచ్చి చూడగా కన్పించలేదు. ఆచూకీ తెలియకపోవడంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మున్సిపాలిటీ పరిధిలో..

మున్సిపాలిటీ పరిధికి చెందిన యువతి బుధవారం మహబూబ్‌నగర్ వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లింది. తిరిగి ఇంటికి రాలేదు. తల్లిదండ్రులు బంధువులు, గ్రామంలో వెతికినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో శుక్రవారం ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఘటనలపై కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

బీసీలకు అన్యాయం

పాలమూరు: బీజేపీ జిల్లాల అధ్యక్షుల కేటాయింపులో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని, ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఒక్కరికి కూడా కేటాయించలేదని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివకుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ ఎంపీ నియోజకవర్గ పరిధిలో సుమారు 60శాతానికి పైగా బీసీలు ఉండగా ఇతరులకు పదవులు ఇవ్వడం సరికాదన్నారు. ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ అయిన శాంతకుమార్‌కు టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సెమినార్‌కు తరలిరండి

చిన్నచింతకుంట: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద శనివారం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో ఇథనాల్ కంపెనీలపై సెమినార్ నిర్వహించనున్నారు. ఈ మేరకు సెమినార్‌కు మరికల్ పరిసర ప్రాంతంలోని వివిధ మండలాల ప్రజలు తరలిరావాలని ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యుడు డాక్టర్ పి. యాదగిరి శుక్రవారం కోరారు.

మున్సిపల్ స్థలాల పరిరక్షణకు చర్యలు

జడ్చర్ల: మున్సిపాలిటీ: పరిధిలో ప్రభుత్వ కమ్యూనిటీ స్థలాల పరిరక్షణకు చర్యలు చేపట్టామని కమిషనర్ మహ్మద్ షేక్ తెలిపారు. పట్టణంలోని పలు వెంచర్లు, తదితర కాలనీలలో విడిచి పెట్టిన 10 శాతం స్థలాల పరిరక్షణకు మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇంకా ఎక్కడైనా కమ్యూనిటీ స్థలాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆయా స్థలాలను గుర్తించి వాటి రక్షణకు చర్యలు చేపడుతామన్నారు.

దుకాణాలకు తాళం

- ట్రేడ్‌లైసెన్స్ లేకపోవడంతో కొరడా ఝుళిపించిన అధికారులు
- పలుమార్లు నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో చర్యలు


జడ్చర్ల-మహబూబ్‌నగర్ దారిలో ఓ దుకాణం మూసివేస్తున్న మున్సిపల్ కమిషనర్, సిబ్బంది

జడ్చర్ల టౌన్: పట్టణ పరిధిలో ట్రేడ్‌లైసెన్స్ పొందని దుకాణాలు, వ్యాపారాలపై మున్సిపాలిటీ అధికారులు సీజ్ కొరడా ఝులిపిస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం జడ్చర్ల-మహబూబ్‌నగర్ దారిలోని పలు టైల్స్, మార్బుల్స్ తదితర 10 దుకాణాలకు తాళం చేశారు. దీంతో స్పందించిన వ్యాపారులు కొందరు ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్‌లు సమర్పించేందుకు సిద్ధమయ్యారు. కాగా కొంతగడువు కోరడంతో మినహాయింపు ఇచ్చేందుకు అధికారులు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. మున్సిపాలిటి పరిధిలో జడ్చర్ల, బాదేపల్లి, కావేరమ్మపేట, నాగసాల, బూరెడ్డిపల్లి గ్రామాలు ఉండగా 2 వేలకుపైగా దుకాణాలు, వ్యాపార సంస్థలున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ముందు గత అక్టోబర్‌లో వాటన్నింటికీ మున్సిపల్ నుంచి నోటీసులు అందాయి. దుకాణం విస్తీర్ణం, పొడవు, వెడల్పు కొలతల ఆధారంగా లైసెన్స్ పొందాలని అందులో సూచనలు చేశారు. స్పందించిన 600 మంది లైసెన్స్ పొందారు. ఈ క్రమంలోనే డబుల్‌రోడ్డులో ఉన్న ఆయా దుకాణాలు, సంస్థలకు చదరపు అడుగుకు రూ.5 చొప్పున అధికారులు పన్ను విధిస్తున్నారు. సింగల్‌రోడ్డులో వాటికి రూ.4చొప్పున పన్ను వేస్తున్నారు. అయితే గతంలో కొలతలకు సంబంధం లేకుండా కేవలం రూ.1000 చెల్లిస్తే లైసెన్స్ మంజూరు చేసేవారు. మారిన నిబంధన ప్రకారం కొలతల ఆధారంగా లైసెన్స్ పొందాల్సి రావటం వ్యాపారులు, దుకాణదారులకు మింగుడు పడటం లేదు.

జడ్చర్ల-మహబూబ్‌నగర్ దారిలో పన్నుఎగవేత

జడ్చర్ల-మహబూబ్‌నగర్ దారిలో హౌజింగ్‌బోర్డు కాలనీ మొదలు శంకరాయపల్లితండా గేట్ వరకు స్థానికేతర వ్యాపారులు పెద్ద సంఖ్యలో టైల్స్, మార్బుల్స్ దుకాణాలు ఏర్పాటు చేశారు. కొలతల ఆధారంగా ఒక్కో దుకాణం రూ.30 నుంచి రూ.50వేల వరకు ట్రేడ్‌లైసెన్స్ పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అయినప్పటికీ పై దుకాణాలు ఇప్పటి వరకు పొందలేదు. నిర్మాణాలు సైతం అనుమతి లేకుండా సాగించారు. రాజకీయ జోక్యం కారణంగానే ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. అయితే మున్సిపాలిటీ నుంచి వీరికి నోటీసులు జారీ అయ్యాయి. స్పందించకపోవడంతో అధికారులు శుక్రవారం చర్యలు తీసుకున్నారు. 10 దుకాణాలను సీజ్‌చేశారు. కొలతల ఆధారంగా పన్నుచెల్లించి దుకాణాలు తెరుచుకోవాలని సూచించారు. కాగా కొందరు వారం రోజులు గడువు కోరటంతో వారిని వదిలేశారు. అయితే అంతకుముందు అధికారులు, వ్యాపారులకు మధ్య కొంత వాగ్వాదం చెలరేగింది.

స్పందించకపోవటంతో సీజ్‌చేశాం

మున్సిపాలిటి పరిధిలోని అన్ని దుకాణాలు, వ్యాపార సంస్థలు, ఆస్పత్రులు, రైస్‌మిల్లులు ఇలా ప్రతీ ఒక్కరూ ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని ట్రేడ్‌లైసెన్స్ పొందాలని గతంతో నోటీసులు జారీచేశాం. స్పందించకపోవడంతో శుక్రవారం చర్యలు చేపట్టాం. కొన్ని దుకాణాలు మూసివేసి తాళాలు వేశాం. కొలతల ఆధారంగా ట్రేడ్‌లైసెన్స్ తీసుకోకపోతే చర్యలు తప్పవు.

–మహమూద్‌షేక్, కమిషనర్, జడ్చర్ల మున్సిపాలిటీ

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

దేవరకద్ర: మండల పరిధిలోని వెంకటాయపల్లి వాగును శుక్రవారం దేవరకద్ర తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్‌ఐ వెంకటేశ్ పోలీసు సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఫిల్టర్ ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో వారు తనిఖీలు చేశారు. రైతులను అడిగి వివరాలు సేకరించారు. వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫిల్టర్ ఇసుకను తయారు చేసి తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయని పట్టుబడితే చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. గ్రామస్తులకుతో, రైతులకు ఇసుక తరలింపుపై తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

యోగి వేమన జయంతి


వేడుకలో పాల్గొన్న రెడ్డిసేవా సమితి ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో యోగి వేమన జయంతి నిర్వహించారు. యోగి వేమన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ సాధారణ మానవునిగా జీవనయానం సాగించి, యోగిగా మారిన వేమన జ్ఞానభాస్కరుడని, సామాజిక ధర్మాలతోపాటు వేదాంత రహస్యాలను సులభశైలిలో చాటిచెప్పిన సంఘ సంస్కర్త అని అన్నారు. తల్లివంటి తెలుగుభాషకు, సరళత్వం కల్పించి పిల్లలు సైతం వల్లెవేయగల అమృతగుళికల వంటి పద్యాల్ని అందించిన సాహితీమూర్తి యోగి వేమన అని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాది మల్లారెడ్డి, టీఎన్‌జీవో జిల్లా మాజీ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, సేవా సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రెడ్డి, అనంతరెడ్డి, ఎల్లారెడ్డి, జి.వెంకట్రాంరెడ్డి, ఎస్.సురేందర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, స్వరూప, వనజ, సునీత, శోభ, కవిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలి


కందూర్‌లో పోలీసుల కళాజాత

అడ్డాకుల: మండలంలోని కందూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సురక్ష పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని బాలికలకు సూచించారు. బాల్య వివాహాలతో జరిగే నష్టాలను వివరించారు. ప్రేమ పేరుతో జరిగే మోసాలకు గురి కాకుండా ఉండాలని చెప్పారు. విద్యార్థులు సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, మోస పూరిత ఓటీపీలను ఎవరితోనూ షేర్ చేసుకోవద్దని చెప్పారు. కార్యక్రమంలో పోలీసులు రాములు, రాజు తదితరులు ఉన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి


క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవినాయక్ ఇతర అధికారులు

మహబూబ్‌నగర్ రూరల్: అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ క్యాలెండర్, డైరీలను శుక్రవారం తన ఛాంబర్‌లో కలెక్టర్ రవినాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అగ్రి డాక్టర్లు రైతులకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. వారికి సలహాలు, సూచనలు అందజేయడంతో పాటు సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలన్నారు. వ్యవసాయంలో నూతన పద్ధతులను వివరించాలన్నారు. పంట మార్పిడిపై అవగాహన కల్పించి అధిక దిగుబడికోసం వ్యవసాయశాఖ అధికారులు కృషి చేయాలని సూచించారు. వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్, అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి మురళీధర్, కోశాధికారి సిద్దార్థ, అధికారులు కిరణ్‌కుమార్, కృష్ణ, కిషోర్, గోపినాథ్, మీనా, ఇష్రత్‌సుల్తానా, శ్యాంయాదవ్, రాజేష్‌ఖన్న, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి



హన్వాడ: రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి హానిచేసే పురుగుల నుంచి పంటలను సంరక్షించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేష్ సూచించారు. జాతీయ ఆహారభద్రత పథకంలో భాగంగా శుక్రవారం ఇబ్రహీంబాద్‌లో పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం వేరుశనగ పంటలకు ఆకుముడత, కత్తెర పురుగులాంటి రోగాలు వస్తున్నాయని అన్నారు. వీటితో పాటు వివిధ పంటలకు సోకే లద్దెపురుగు, ఆకు పురుగుల నుంచి రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పలు సూచనలు చేశారు. మండల అధికారి కిరణ్, ఏఈఓ రమేష్, పథకం టెక్నికల్ అధికారి రామకృష్ణ గౌడ్, స్థానిక రైతులు, తదితరులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి


తనిఖీల్లో పాల్గొన్న ఎస్‌ఐ శేఖర్, సిబ్బంది

చిన్నచింతకుంట: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని ఎస్‌ఐ శేఖర్ సూచించారు. శుక్రవారం మండలకేంద్రంలోని బస్టాండ్ కూడలిలో వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. లేనిచో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

22న ప్రత్యేకపూజలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా జిల్లా కేంద్రంలోని 16వార్డు బోయపల్లిలో ఈనెల 22న ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉదయం హన్మంతుగుట్ట కోదండ రామాలయ సన్నిధి వరకు ఊరేగింపు చేపట్టనున్నారు. అనంతరం ధార్మిక ప్రవచనం, భజన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అదేవిధంగా శ్రీరామనామ జప హోమం, సాయంత్రం గ్రామోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేయనున్నట్లు వివరించారు. గ్రామస్తులు, పెద్దలు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

అభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే యెన్నం


యోగా విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆరెకటికల అభివృద్ధి కోసం కృషి చేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆరెకటికల నూతన సంవత్సరం క్యాలెండర్లను ఆవిష్కరించారు. ప్రభుత్వం ద్వారా వచ్చే అభివృద్ధి ఫలాలను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రవీందర్‌జీ, కృష్ణజీ, శ్రీనివాసులుజీ, నరేష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లా ఏకలవ్య (ఎరుకల) సంఘం క్యాలెండర్, గజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్ డైరీలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్‌లో భాగంగా వినతులు స్వీకరించారు. జర్నలిస్టు తిరుపతయ్యకు అండగా ఉంటామని ఎమ్మెల్యే అన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఆయనను ఎమ్మెల్యే ఎమ్మెల్యే పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని.. ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం చేస్తామన్నారు.

యోగా విద్యార్థులకు అభినందనలు

జాతీయస్థాయి యోగా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు స్వప్న, సుప్రజలను క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అభినందించి సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వెంకట్రాములు, గంగాధర్, దత్తురావు, బాల నర్సిములు, చంద్రశేఖర్, సాయికుమార్, సురేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాలమూర్ పట్టణంలో 'స్వచ్ఛ తీర్థ్'


టీచర్స్‌కాలనీలో మసీదు ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న ముస్లింలు


షాషాబ్‌గుట్టతండాలోని రేకుల మసీదు వద్ద శుభ్రం చేస్తున్న కౌన్సిలర్ షబ్బీర్‌అహ్మద్, కార్మికులు


పాలకొండతండా లోని వీరాంజనేయస్వామి ఆలయంవద్ద

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పట్టణంలోని వివిధ ఆలయాలు, ప్రార్థన మందిరాల వద్ద 'స్వచ్ఛ తీర్థ్' నిర్వహిస్తున్నారు. ఈనెల 21వ తేదీ వరకు కార్యక్రమంకొనసాగనుంది. ఇందులో భాగంగా శుక్రవారం టీచర్స్‌కాలనీ (వార్డు నం.8) లోని మసీదు వద్ద, పాలకొండతండా (వార్డు నం.9) లోని వీరాంజనేయస్వామి ఆలయం, షాషాబ్‌గుట్టతండా (వార్డు నం.19) లోని రేకుల మసీదు తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేశారు. కార్యక్రమంలో 19వ వార్డు కౌన్సిలర్ షబ్బీర్‌అహ్మద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు చూయించాలని ధర్నా


ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

చిన్నచింతకుంట: ఎదులాపురంలో గత ప్రభుత్వం ఇచ్చిన ఇంటిపట్టాలకు స్థలాలను చూయించాలని డిమాండ్ చేస్తూ లబ్ధిదారులు శుక్రవారం గ్రామంలోని చిన్నచింతకుంట, దేవరకద్ర రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సునీత, నిర్మల, మణెమ్మ తదితరులు మాట్లాడారు. కొన్ని నెలల క్రితం అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామంలోని 38 మంది నిరుపేదలకు ఇళ్ల నిర్మాణానికి స్థలాలను కేటాయిస్తూ పట్టాలు అందజేసిందన్నారు. కానీ అట్టి స్థలాల పట్టాలకు సంబంధించి నేటివరకు స్థలాలను చూయించలేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్థలాలను చూయించాలని డిమాండ్ చేశారు. విషయంపై తహసీల్దార్ కృష్ణయ్య స్పందించారు. త్వరలోనే స్థలాలు చదును చేసి అందిస్తామని తెలిపారు. దీంతోవారు ధర్నా విరమించారు.

క్రీడా దినోత్సవం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ఏబీవీపీ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద, నేతాజీ సుభాస్‌చంద్రబోస్ జయంతులను పురస్కరించుకుని యువజనోత్సవ క్రీడాపోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా క్రికెట్ పోటీలను పాలమూరు విభాగ్ ప్రముఖ్ కర్నెరామచందర్ ప్రారంభించారు. కార్యక్రమంలో వేణు, అధ్యాపకులు సోమేశ్వర్, సురేష్, నరేష్, తేజ, ఏబీవీపీ అర్జున్, కృష్ణ, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్‌లో పాఠశాలల తనిఖీ



మిడ్జిల్: మండల పరిధిలోని యూపీఎస్ చిల్వేర్, పీఎస్ వస్పుల పాఠశాలలను శుక్రవారం ఎంఈఓ మంజులాదేవి, మండల నోడల్ అధికారి వెంకటయ్య తనిఖీ చేశారు.పాఠశాలలో హాజరు శాతం పరిశీలించారు.అలాగే వివిధ అంశాలపై విద్యార్థులను ప్రశ్నలు అడిగారు. విద్యార్థులకు అర్థం అయ్యే విధంగా బోధన కొసాగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో రాజీపడొద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మహాసభ పోస్టర్ విడుదల

దేవరకద్ర: తెలంగాణ ప్రగతీ శీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మొదటి మహాసభ పోస్టర్‌ను శుక్రవారం దేవరకద్రలో విడుదల చేశారు. ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు దేవదానం, కార్యదర్శి సాంబశివుడు ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ నెల 28న వనపర్తి జిల్లా కేంద్రంలో మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కనీస వేతన చట్టం అమలు చేయాలని మల్టీ పర్పస్ విధానం రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆంజనేయులు, రాజు, రాము, జయమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.



రెండోరోజూ వార్డుల్లో పరిశీలన


టీడీగుట్ట నుంచి న్యూగంజ్‌కు వెళ్లే దారిలో పెద్ద నాలాను పరిశీలిస్తున్న స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ రెండోరోజు శుక్రవారం పట్టణంలోని 31, 32, 33, 34, 45వ వార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ముఖ్యంగా కోయిల్‌కొండ ఎక్స్‌రోడ్డు సమీపంలోని కల్వర్టు వద్ద మురుగుకాల్వ మధ్యలో నుంచి వెళ్తున్న మిషన్ భగీరథ పథకం పైపులైన్లను చూసి ఆశ్చర్యపోయారు. వాటిని సరిచేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అలాగే టీడీగుట్ట నుంచి న్యూగంజ్‌కు వెళ్లే దారిలో పెద్ద నాలాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా వార్డులలో నెలకొన్న సమస్యలపై స్థానికులతో ఆరా తీశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్, ఏసీపీ జోత్స్న, టీపీఓ లక్ష్మీపతి, ఎంఈ బస్వరాజ్, డిప్యూటీ ఈఈ బెంజమిన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గురులింగం, వాణీకుమారి, ఏఈ పృథ్వీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ లోని తన చాంబర్‌లో మున్సిపల్ అధికారులతో సమీక్షించారు.